# 'మనవి' చేసుకుంటున్నాను!

-వారణాసి రామకృష్ణ

**ఇంటి పనులు, వంట పనులు ముగించి హాల్లోకి వచ్చి టీవీ ఆన్ చేశాను. ఎవరో రాజకీయ నాయకుడు - వీరావేశంతో ఉపన్యాసమిస్తున్నాడు.**

'... ప్రజల సమస్యలు నాకు తెలిసినంత బాగా ఎవరికి తెలుసు? నియోజకవర్గాల్లో ప్రతి కార్యకర్తను నేను గుర్తుపట్టగలను. పేరు పేరునా పలకరించి కష్టసుఖాలు తెలుసుకోగలను...'

ఆహా! ఏం కొడుతున్నావయ్యా - ధరలు పెరిగి నిత్యం నానా బాధలు పడుతుంటే చేసేదేమీ లేదు గానీ పెద్దగా కబుర్లు... శుష్క వాగ్దానాలు!

'- ముఖ్యంగా నీటిపారుదల రంగంలో రాష్ట్రం బాగా వెనకబడి ఉంది. ఇందుకోసం కేంద్రం నుండి నిధులు రాబట్టాలి. దీని కోసం అవసరమైతే ప్రాణ త్యాగం చేసి పోరాడాలి. అయితే ఈ పోరాటాన్ని ప్రతిపక్ష పార్టీల వాళ్ళు రాజకీయం చేస్తున్నారని నేను మీకు మనవి చేస్తున్నాను. నా పోరాటాన్ని గమనించి, ప్రజా శ్రేయస్సు కోసం నేను పడే ఆరాటాన్ని గుర్తించి, నా పాలనను పరిశీలించి ప్రపంచ బ్యాంకు నాలుగొందల కోట్ల రుణం మంజూరు చేసిందని మీకు మనవి చేసుకుంటున్నాను!'-



- ఎవరీ నేత? ఎక్కడో చూసినట్టుంది. ముఖ్యంగా ఆ కంఠస్వరం - మనవి చేసుకుంటున్నాను! మనవి చేసుకుంటున్నాను! మనవి - మనవి - మైగాడ్!

అతనెవరో అర్థమయ్యేసరికి నా వొళ్ళు ఝల్లుమంది. శరీరం స్వాధీనం తప్పుతున్నట్టుంది!

ఒక్కసారిగా నా ఆలోచనలు గతంలోకి జారుతూ-

'పార్వతమ్మగారూ! పార్వతమ్మగారూ!'

వీధిలో అప్పిగాడు ఎందుకలా గావుకేకలు పెడుతున్నాడా అని బైటికొచ్చాను. నన్ను చూసి వాడు 'అమ్మగోరూ! సంతలో మంచి తాజా కూరలొచ్చాయండి తీసుకు రమ్మంటారా?' అడిగాడు.

'నీకెలా తెలుసురా?'

'ఎదురింటి సుభద్రమ్మగోరు బజారుకి పంపితె యెల్లానండీ! తాజా కూరలు ఇప్పుడే బండిలోంచి దింపుతుంటే చూశానండి!'

'సరే - తీసుకురా!' అని సంచీ డబ్బులు ఇచ్చాను.

అప్పిగాడు ఎవరో, ఎక్కడ్నించి వచ్చాడో నాకు తెలీదు. చాలా రోజుల క్రితం ఓ వర్షం రోజున వరండాలో అలికిడి అయి చూస్తే - చిన్న గుంటడు!

'నీ పేరేంట్రా?' అని అడిగితే 'అప్పిగాడు' అన్నాడు. చలికి వణుకుతూ బెదురుచూపులతో నిలబడ్డాడు. ఆకలి కడుపు ఎండిపోయి లోతుకు పోతే - పాపం అని అన్నం పెట్టాను.

అంతే! ఆ రోజు నుండి వాడు పొమ్మన్నా పోకుండా మా ఇంట్లోనే ఉన్నాడు. మా వారు కూడా 'ఉండనీ పార్వతీ! మనకున్న ముగ్గురు పిల్లలతోపాటు వీడొకడూ! వెళ్ళమని చెప్పకు' అనేవారు.

చెప్పింది చేస్తూ, పెట్టింది తింటూ అన్ని పనులూ చేసేవాడు.

అప్పిగాడు పెద్దయ్యాడు! వాడితోబాటు వాడి కంఠస్వరం! వొంట్లో లీటరు రక్తం, రెండు కిలోల మాంసం తప్ప మరేం లేనట్టు పీలగా, బక్కగా ఉండే వీడికి గొంతు మాత్రం అంత పెద్దగా ఎలా వచ్చిందో అర్థం కాలేదు.

మాట్లాడాడు అంటే వీధివీదంతా ఖంగుమని వినిపించేది.

ఇప్పుడు వాడు వీధిలో అందరికీ ఆపద్బాంధవుడు. సంబరాల రాంబాబు లెవెల్లో అందరికీ తలలో నాలుక!

సుభద్రమ్మగోరూ! లేత వంకాయలు తెమ్మంటారా?

సుబ్బారావుగోరూ! మీ బట్టలు ఇస్త్రీ కిస్తారా?

రాజు తాతగోరూ! నశ్యం డబ్బా తెచ్చి మీ కోడలి గోరికిచ్చాను!

-తరచు వీధి వీధంతా వినిపించేవి వాడి మాటలు!

కొన్నాళ్ళకి విచిత్రంగా వాడి మాటల్లో తేడా-

సుభద్రమ్మగోరూ! పాలకూర తెచ్చానని మనవి చేసుకుంటున్నాను!

సుందరయ్యగోరూ! కరెంటు బిల్లు కట్టేసేనని మనవి చేసుకుంటున్నాను!

మహాలక్ష్మమ్మగోరూ! మీ అబ్బాయి స్కూలు ఫీజు కట్టేనని మనవి చేసుకుంటున్నాను!

-వీడి దుంపతెగ! వాడి అరుపులు - కేకలు విన్నప్పుడల్లా చచ్చే నవ్వొచ్చేది. ప్రతీ మాటకి - మనవి చేసుకుంటున్నాను! వాడ్ని పిలిచి ఓసారి 'ఏంట్రా అప్పిగా! ప్రతి దానికీ ఈ మనవి చేసుకోవటమేమిట్రా?' నవ్వుతూ అడిగాను.

వాడూ సిగ్గుపడి నవ్వేసి 'తమరి దగ్గర మాత్రం మనవి చేసుకోనండి' అన్నాడు.

వాడలా ఎందుకన్నాడో అప్పుడు అర్థం కాలేదు. ఏ విషయం చెప్పాలన్నా 'మనవి' తగిలించకుండా నాకు చెప్పేవాడు. అదే వీధిలో ఎవరికి సమాచారం ఇచ్చినా ఈ మనవి

మాత్రం తగిలించడం మానేవాడు కాదు.

'ఇదేంట్రా అప్పిగా! పాలకూరకి, కరెంటు బిల్లుకి మనవి తగిలించి చేస్తావు! మరి నా విషయంలో మాత్రం - నేను పూర్తిగా చెప్పక ముందే- 'చెప్పేను గదండీ! తమరి దగ్గర మాత్రం మనవి చేసుకోనండి!'

నవ్వుతూ అన్నాడు. వాడి నవ్వు చూసి ఈ మనవి వెనక ఏదో మాయల ఫకీరు రహస్యం ఉందనిపించి-

'ఏంట్రా - చెప్పు- అసలు విషయం ఏమిటి?' రెట్టిస్తూ అడిగాను.

సిగ్గుతో నవ్వేసి 'అదమ్మగోరు... అదమ్మ గోరు' నసిగాడు. అంతలోనే తలెత్తి 'వద్దు లెండి అమ్మగారూ! తమరికి మాత్రం మనవి చేసుకోను!' అన్నాడు మళ్ళీ.

'ఛీ వెధవా! చెప్పు' గద్దరిమాను.

చెప్పక తప్పదా అన్నట్లు చూశాడు. 'చెప్పరా' గట్టిగా గదిమాను.

'మీరు నాకు పట్టెడన్నం పెట్టి పంచలో పడుకొమ్మని చోటు ఇచ్చారు. మీరు ఏ పని చెప్పినా చేస్తాను. కానీ వీధిలో వాళ్ళు నాకేం చేస్తారు? అందుకని వాళ్ళకి చేసే పని చేసి పెట్టి అందులోంచి కొంచెం మనవి చేసుకుంటున్నా నమ్మగోరూ!' మెల్లిగా చెప్పాడు. నాకేం అర్థంకాక 'అంటే?' అన్నాను.


'అదేనమ్మగోరూ - మనవి - మనవి - అంటే నావి! సొంతం చేస్కోవటం'

ఓర్నీ! 'మనవి' చేస్కోడమంటే ఇదా అర్థం?' ఆశ్చర్యంతో నోరు తెరిచాను.

ఆ తర్వాత వీధిలో - పాలకూర వచ్చిందని మనవి చేసుకుంటున్నాను. కరెంటు బిల్లు కట్టానని మనవి చేసుకుంటున్నాను!

అంటూ కేకలు వినబడుతూంటే అప్పిగాడు రోజూ కమీషన్ల కింద ఎంతెంత నొక్కేస్తున్నదీ అర్థమయ్యేది.

ఆ తర్వాత అప్పిగాడు ఎక్కడికి పోయాడో ఏమో



**'మీరు నాకు పట్టెడన్నం పెట్టి పంచలో పడుకొమ్మని చోటు ఇచ్చారు. మీరు ఏ పని చెప్పినా చేస్తాను. కానీ వీధిలో వాళ్ళు నాకేం చేస్తారు? అందుకని వాళ్ళకి చేసే పని చేసి పెట్టి అందులోంచి కొంచెం మనవి చేసుకుంటున్నా నమ్మగోరూ!' మెల్లిగా చెప్పాడు. నాకేం అర్థంకాక 'అంటే?' అన్నాను.**

ఎవ్వరికీ తెలీదు. కాకపోతే చాలా రోజుల తర్వాత వీధి వీధంతా అరుపులు - కేకలు!

సంవత్సరంబట్టి స్కూల్లో కట్టమని ఇస్తున్న ఫీజు అప్పిగాడు అసలు కట్టనే లేదట - ఓ ఇల్లాలి గోల!

కుట్టమని టైలర్‌కి ప్యాంటు గుడ్డ ఒకటే ఇచ్చాడట. షర్టు ఇవ్వలేదు - సుబ్బారావు ఆర్తనాదం!

కరెంటోళ్ళు మా ఇంట్లో కనెక్షను పీకేశారు - ఎవరిదో ఏడుపు!

-వార్నీ! జనాల్ని ఎంతలా 'మనవి' చేస్కున్నావురా అప్పిగాడా!

ధడేల్‌మని తలుపు చప్పుడయితే ఉలిక్కిపడి ఫ్లాష్ బ్యాక్‌లోంచి బైటపడ్డాను. మా వారు ఆఫీసు నుండి వచ్చేశారు. పరుగు పరుగున ఎదురెళ్ళి - ఎంతో ఆత్రుతగా - 'ఏమండీ! మీకో షాకింగ్ న్యూసు చెప్పనా! చాలా కాలం క్రితం మనింట్లో పని చేశాడే - అప్పిగాడు....' అంటూ పూర్తిగా చెప్పేలోగానే మా వారు నా నోరు మూసేసి 'ష్! ఇప్పుడాయన్ని అప్పిగాడు, చుప్పిగాడు అనకు! రాష్ట్ర మంత్రి మనవి అప్పారావుగారు అనాలి!'

'అంటే... అంటే... నీకు మనవి అప్పారావు గురించి ముందే తెలుసా?'

'యస్! తెలుసునని శ్రీమతిగారికి మనవి చేసుకుంటున్నాను' గలగలమని నవ్వేశారు!


టీవీలో పొద్దున్న విన్న ప్రసంగం గుర్తొచ్చింది- 'ప్రపంచ బ్యాంకు రుణం నాలుగొందల కోట్లని 'మనవి' చేసుకుంటున్నాను!'

వామ్మో! వా నాయనో! ప్రజలారా! నా పిచ్చి జనాల్లారా! వెంటనే మేల్కొనండి! కళ్ళు తెరవండి - అని మీకు మనవి ... ఛ...ఛా! ఆ 'మనవి' కాదు నిజంగానే - మనవి చేసుకుంటున్నాను!

★

# భోపాల్ బాధితుడు కథా నాయకుడుగా లాపీర్ కొత్త నవల

చారిత్రక నవలలు అనేవి ఉన్నాయి. అవి గతాన్ని సగం నిజంగా సగం కల్పనగా ఆవిష్కరిస్తాయి. వర్తమానం కూడా చరిత్రే, ఇది నడుస్తున్న చరిత్ర. వర్తమాన చారిత్రక నవలలూ ఉన్నాయి. ఇవి సాధారణంగా రచన కోసం రచన అన్నట్లుండవు. వాటి వెనుక తక్షణ ప్రయోజనం ఉంటుంది. రెండు దశాబ్దాల క్రితం కలకత్తా నగరంలోదైనందిన జనజీవన విషాదం వస్తువుగా డొమినిక్ లాపీర్ రాసిన నవల 'సిటీ ఆఫ్ జాయ్' అలాంటి 'చారిత్రక నవల'లకు మంచి నమూనా గణుతికెక్కింది. ఆ నవలలో కథానాయకుడు కలకత్తాలోని ఒక రిక్షా పుల్లర్. ఆ నవల ఆధారంగా, ఓం పురీ కథానాయకుడుగా వచ్చిన సినిమా సృష్టించిన సంచలనం- సంచలనాల్ని ఫాలో అయ్యే వారందరికీ- జ్ఞాపకమే. లాపీర్ నవల రాసి, డబ్బు చేసుకుని ఊరుకోలేదు. చేసుకున్న డబ్బులో గణనీయ భాగాన్ని కలకత్తా పేద వాళ్లకు ఉపయోగకరంగా వినియోగించాడు. ఇరవయ్యేళ్ల తరవాత ఇప్పుడు లాపీర్ తన బంధువు, స్పానిష్ జర్నలిస్టు జేవియర్ మోరోతో కలిసి మరో సంచలనం సృష్టిస్తున్నారాయన. ఈసారి కార్యరంగం భోపాల్. కథావస్తువు భోపాల్ గ్యాస్ విక్టిమ్స్ బాధలు. ''ఇట్ వాజ్ 5 పాస్ట్ మిడ్‌నైట్ ఇన్ భోపాల్'' అనే ఆయన కొత్త నవల వచ్చే నెల 15న ఫ్రెంచ్, స్పానిష్ భాషలలోవెలుగు చూడబోతున్నది.1984 భోపాల్ గ్యాస్ దురంతం ఇప్పటికీ జనం మనసులలో పచ్చిపచ్చిగానే ఉంది. ఆ పెను విషానికి గురై చనిపోయిన వారు, ఇంకా జీవించి వుండి ఆ బాధలు అనుభవిస్తున్న వారు లక్షలాది మంది జీవితాలు సబ్జెక్టుగా రూపొందిన 400 పేజీల ఈ 'వాస్తవ కథ'లో గంగా రామ్ అనే పేదవాడు, అతని భార్య దాలిమా నాయికా నాయకులు. గ్యాస్ ఘోరకలికి గురై బతికి బయట పడినా, దాని దుష్ఫలితాల్ని ఇప్పటికీ అనుభవిస్తున్న అసంఖ్యాలకు వారు మచ్చుతునకలు. కథ భోపాల్‌వాసులకు పరిమితం కాదు. బాధితులలో చాలమంది ఒరిస్సా నుంచి వచ్చిన వలస శ్రామికులు. వారందరి జీవితాలను నవల ప్రతిబింబిస్తుంది. ఇటీవల వారం రోజుల పాటు భోపాల్‌లో గడిపిన లాపీర్ అక్కడ 'సిటీ ఆఫ్ జాయ్ ఫౌండేషన్' నిధులతో నడుస్తున్న 'డొమినిక్ లాపీర్- సిటీ ఆఫ్ జాయ్ సంభావన గైనకొలాజికల్ క్లినిక్' ప్రారంభోత్సవ సభలో పాల్గొన్నారు. ''కలకత్తా మురికివాడల్లో బాధలు పడుతున్న జనాన్ని చూశాను. వారితో కలిసి తిరుగుతూ వారి కోసం నా పద్ధతిలో నేను ఏమైనా చేయడానికి ప్రయత్నించాను. అలాగే ఇప్పుడు భోపాల్ బాధితులతో చేతులు కలుపుతున్నాను... నా కొత్త పుస్తకంలో ఆశ్చర్యకరమైన సంగతులు చాలానే వుంటాయి. నవల యూనియన్ కార్బైడ్ యాజమాన్యం తప్పిదాలను, వారి నేరపూరిత ప్రవర్తనను తేటతెల్లం చేస్తుంది.'' అన్నారు డొమినిక్ లాపీర్.



డొమినిక్ లాపీర్

**-కరుణ**